సాక్షి ఆదిలాబాద్

బుధవారం : 21 : ఫిబ్రవరి : 2024



కమ్మనైనది.. అమ్మభాష

భావప్రసారానికి మాతృభాషే కీలకం. తొలిపలుకులు నేర్చేది అమ్మభాషలోనే. నేడు మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో▸

హీరాసుక జయంతికి రావాలని ఆహ్వానం

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈనెల 26న నిర్వహించే హీరాసుక జయంతి వేడుకలకు రావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఆయన నివాసంలో ప్రధాన్ సమాజ్ పెద్దలు మంగళవారం ఆహ్వానం అందించారు. అనంతరం హీరాసుక జయంతి కరపత్రం ఆవిష్కరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/19.0

చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం తగ్గనుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న శిక్షణ



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో గజానన్

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆన్‌లైన్ పోర్టల్ హెచ్‌ఎంఐఎస్‌పై ఇస్తున్న శిక్షణ కార్యక్రమం రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, డాటాఎంట్రీ ఆపరేటర్లు హాజరయ్యారు. ఎయిడ్స్, లైంగిక సంబంధిత వ్యాధులపై అదనపు డీఎంహెచ్‌వో గజానన్ అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో సమాచారం నమోదు చేసే విధానాన్ని పవర్‌పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారి వామన్‌రావు, డీడీఎం రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయం అందాలి

ఆదిలాబాద్‌టౌన్: అందరికి సమన్యాయం అందాలని సార్క్ నేషన్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రీజినల్ చైర్మన్ గుర్రం పున్నంరావు అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం, లింగ సమానత్వం, నిరుద్యోగం, మానవ హక్కులు, సామాజిక రక్షణ వంటి సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఏటా ఫిబ్రవరి 20న ప్రపంచ న్యాయ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో వెంకటపతిరాజు, విజయ్, రవీందర్, లక్ష్మణ్, అజయ్, చందు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సీటీవోగా నళినిమోహన్ బాధ్యతలు



పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: వాణిజ్య పన్నులశాఖ ఆదిలాబాద్ సర్కిల్ సీటీవో(ఎఫ్ఏసీ), మేనేజర్‌గా నళిని మోహన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనను ఆ శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆదిలాబాద్ డివిజన్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇందులో సంఘం అధ్యక్షుడు టి.హరికిషన్, కార్యదర్శి బి.సాయికృష్ణ, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ అఖిల్, ఉపాధ్యక్షులు ఫహీం, అజారుద్దీన్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

గృహజ్యోతి సమాచార అప్‌డేట్‌కు ప్రత్యేక లింక్

కైలాస్‌నగర్: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ప్రకటనలో తెలిపారు. అయితే లబ్ధిదారుల ఎంపిక కోసం సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించడంలో తీవ్ర జాప్యం అవుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో వినియోగదారుల ప్రయోజనార్థం తమ సమాచారాన్ని ఇంటి వద్ద నుంచే అప్‌డేట్ చేసుకునేలా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక లింక్‌ను పంపించనున్నట్లు తెలిపారు. https://tsnpdcl.in/Menu/j2s/LinkAadharMobile లింక్‌ను ఓపెన్ చేసి మొబైల్ నంబర్ టైప్ చేస్తే ఓటీపీ వస్తుందని పేర్కొన్నారు. ఆ ఓటీపీ సబ్మిట్ చేసిన తర్వాత కరెంటు బిల్, యూఎస్సీ నంబర్ నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత మొబైల్, ఆధార్ నంబర్లు, ఇంటి, కరెంట్‌బిల్‌తో లింక్ అవుతుందని తెలిపారు. గృహ జ్యోతికి సంబంధించిన ప్రతులు విద్యుత్‌శాఖ సిబ్బందికి అందించని వారు ఈ లింకు ద్వారా తమ సమాచారాన్ని అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన డీపీఆర్వో

కై లాస్‌నగర్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి తిరుమల మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ సమావేశ మందిరంలో కలిసి పూలమొక్క అందజేశారు.

గొల్ల, కుర్మల గోస



వీరంతా తలమడుగు మండలంలోని భరంపూర్ గ్రామానికి చెందిన యాదవ కులస్తులు. గత ప్రభుత్వం గొల్ల, కుర్మల కోసం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం లబ్ధి కోసం 2022 సెప్టెంబర్‌లో ఒక్కొక్కరు రూ.43,950 చొప్పున ప్రభుత్వానికి డీడీలు చెల్లించారు. చేతిలో డబ్బుల్లేకపోయినా గొర్రెలు వస్తాయనే ఆశతో అప్పులు చేసి మరీ డీడీలు కట్టారు. రెండేళ్లు గడిచినా వారికి గొర్రెలు అందలేదు. గొర్రెలైనా అందించాలని లేదంటే తాము కట్టిన డీడీల సొమ్మునైనా వెనక్కివ్వాలని పశుసంవర్ధకశాఖ అధికారులతో పాటు కలెక్టర్‌ను పదే పదే వేడుకుంటున్నా ప్రయోజనం శూన్యం. వీరే కాదు జిల్లాలోని 1744 మందిది ఇదే గోస.



- ఏళ్లు గడిచినా అందని గొర్రెలు
- అప్పులు తెచ్చి కట్టిన డీడీలు సైతం వెనక్కిరాని పరిస్థితి
- చెప్పలరిగేలా తిరుగుతున్నా కనికరించే వారు కరువు

జిల్లాలో..
గొర్రెల పెంపకం సహకార సొసైటీలు 133
సొసైటీల్లోని మొత్తం సభ్యులు 8,660
మొదటివిడతలో గొర్రెలు పొందిన వారు 5,022
గొర్రెల పంపిణీ కోసం చేసిన ఖర్చు: రూ.62.77కోట్లు
రెండో విడతలో గొర్రెలు పొందిన వారు 567
గొర్రెల పంపిణీ కోసం చేసిన ఖర్చు రూ.8.95కోట్లు

కైలాస్‌నగర్: కుల వృత్తిపై ఆధారపడి జీవించే గొల్ల, కుర్మలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన జిల్లాలోని పలువురు గొల్ల, కుర్మలు గోస పడుతున్నారు. రెండేళ్లు గడుస్తున్నా వారికి ఇప్పటికీ గొర్రెలు అందలేదు. పంపిణీపై కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

5, 022 మందికి లబ్ధి

గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం 2017లో ప్రారంభించింది. గ్రామీణ ప్రాథమిక గొర్రెల పెంపకం సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 18ఏళ్లు పైబడిన వారికి యూనిట్లు అందించాలని నిర్ణయించింది. తహసీల్దార్, ఎంపీడీవో, మండల పశువైద్యాధికారి సభ్యులతో కూడిన లబ్ధిదారుల ఎంపిక కమిటీని నియమించింది. వీరి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఏ, బీ గ్రూపులుగా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఏ గ్రూపులో 4,323 మందిని ఎంపిక చేయగా అందులో 4,282 మందికి 2020 సంవత్సరం వరకు గొర్రెలను పంపిణీ చేశారు. 4,337 మందితో బి–లిస్టును తయారు చేయగా అందులో కేవలం 740 మందికి మాత్రమే యూనిట్లు అందాయి. మొత్తం రెండు లిస్టుల్లో కలిపి 5,022 మందికి గొర్రెలను అందజేశారు.

1,744 మందికి తప్పని అవస్థలు

ఏ, బి గ్రూపుల్లో నుంచి 3,597మందికి గొర్రెలను అందించాల్సి ఉంది. అయితే ఇందులో 2,311 మంది మాత్రమే గొర్రెల కోసం ప్రభుత్వానికి డబ్బులను చెల్లించారు. 2020 తర్వాత గొర్రెల పంపిణీని నిలిపివేసిన ప్రభుత్వం గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరోసారి పంపిణీ ప్రక్రియ చేపట్టింది. 2020కి ముందు మొదటి విడతలో యూనిట్ ధర రూ.1.25లక్షలుగా ఖరారు చేసింది. ఇందులో లబ్ధిదారుడు 25శాతం వాటాగా రూ.31,250 చెల్లించారు. ప్రభుత్వం 75శాతం వాటాగా రూ.93,750తో గొర్రెలను అందజేసింది. ధరలన్నీ పెరిగాయనే ఉద్దేశంతో గతేడాది యూనిట్ ధరను రూ.1.75లక్షలకు పెంచింది. ఇందులో లబ్ధిదారుడు తన వాటాగా రూ.43,750 చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం 75 శాతం వాటాగా రూ.1,31,250తో లబ్ధిదారుడికి గొర్రెలను అందించాలని నిర్ణయించింది. తొలి విడతలో అమలు చేసిన డీడీల విధానానికి స్వస్తి పలికింది. డీడీలు అందించి నెలలు గడిచినా గొర్రెలను అందజేయకపోవడంతో అవి ల్యాప్స్ కావడం, అధికారులకు అందించిన డీడీలు దొరక్కపోవడం వంటి కారణాలతో డీడీలను రద్దు చేసింది. దానికి బదులుగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి యాక్సిక్ బ్యాంక్ నుంచి ఆన్‌లైన్ అకౌంట్ నంబర్‌ను కేటాయించింది. లబ్ధిదారుడు ఆ ఆకౌంట్‌కు తన వాటా నగదు జమ చేశాడు. 2,311 మంది ఇలా తమ వాటాను జమ చేశారు. ఇందులో కేవలం 567 మందికి మాత్రమే ప్రభుత్వం గొర్రెలను అందించింది. ఇంకా 1,144 మందికి ఎదురుచూపులు తప్పడం లేదు. మూడేళ్లుగా గొర్రెలు ఇవ్వకపోవడంతో విసుగు చెందిన గొల్ల, కుర్మలు తమకు గొర్రెలనైనా ఇవ్వాలని లేకుంటే డీడీల సొమ్మునైనా వెనక్కివ్వాలంటూ జిల్లాలోని పలు మండలాల్లో ఆందోళనలు చేపడుతున్నారు. స్వయంగా కలెక్టర్‌ను ఇప్పటికే పలుమార్లు కలిసి వేడుకున్నారు. ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

గొర్రెలను పంపిణీ చేయాలని, లేకుంటే వారు అడుగుతున్నట్లుగా గొల్ల, కుర్మలు కట్టిన డీడీలు వెనక్కి ఇచ్చేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పలుమార్లు నివేదించాం. ప్రభుత్వం నుంచి ఇప్పటిదాకా ఎలాంటి స్పందన రాలేదు. ప్రభుత్వమిచ్చే తదుపరిఉత్తర్వులకనుగుణంగా చర్యలు తీసుకుటాం. అప్పటి వరకు మేము ఏం చేసేదిలేదు.

– బి.కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం



ఇంటర్మీడియెట్ పరీక్షలపై అదనపు కలెక్టర్ సోమవారం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న అధికారులు

- ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు..
- పకడ్బందీ నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు
- హాజరుకానున్న 21,527 మంది విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల కోసం జిల్లా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈనెల 28నుంచి మార్చి 19 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయాకేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు,ఫ్యాన్లు, వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలు..

పరీక్షల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 2 సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలు, 5 ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు, తొమ్మిది ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఒక మోడల్ స్కూల్ ఉన్నాయి. మొత్తం 21,527 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 10,640, ఒకేషనల్ 1,026 మంది ఉన్నారు. ద్వితీయ సంవవత్సరం జనరల్ విద్యార్థులు 8,824 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,037మంది హాజరు కానున్నారు.

పకడ్బందీ చర్యలు

పరీక్షల నిర్వహణ కోసం అధికారులు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), 30 మంది డిపార్ట్‌మెంటల్ (డీఓ) అధికారులు, ముగ్గురు కస్టోడియన్లు, 2 సిట్టింగ్‌స్క్వాడ్, రెండుఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. వీరితో పాటు డీఈసీ కమిటీని నియమించారు. అలాగే ఐపర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో కలెక్టర్ కన్వీనర్‌గా, సభ్యులుగా ఎస్పీ, ఆర్‌జేడీ, డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్, జూనియర్ లెక్చరర్లు ఉండనున్నారు. ఏవైనా సంఘటనలు తలెత్తితే ఈ కమిటీ పర్యవేక్షణ చేపట్టనుంది.

ఇబ్బందులు తలెత్తకుండా..

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నిచర్, తాగునీటి సౌకర్యంతో పాటు వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రథమ చికిత్సకోసం సిబ్బందిని నియమించారు. ఫ్యాన్ల ఏర్పాటుతో పా టు వెలుతురు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆ సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచనున్నారు. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల సమక్షంలో తెరవనున్నారు. పరీక్ష ముగిసిన తర్వాత సీసీ కెమెరాల సమక్షంలోనే సీజ్ వేయనున్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు స్టేషన్ నుంచి స్క్వాడ్ ద్వారా పరీక్ష కేంద్రాలకు తరలిస్తారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా కూడా హాల్‌టికెట్లను tsbie. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. వాటితో నేరుగా పరీక్షకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. హాల్‌టికెట్లపై ఎవరి అటెస్టెడ్ అవసరం లేదని తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాల నుంచి ఇబ్బందులకు గురయ్యే విద్యార్థులు 9848781808, 08732–297115 ద్వారా డీఐఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించవచ్చు.

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు..



విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలి. అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నాం. మాస్‌కాపీయింగ్‌పై ఆధారపడొద్దు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలి. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్షకు హాజరుకావచ్చు. ఏవైన సందేహాలు ఉంటే డీఐఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలి.

– రవీందర్‌కుమార్, డీఐఈవో

బంజారాల సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి
- హాజరైన ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, బొజ్జు, శంకర్



వేడుకలకు హాజరైన బంజారాలు



సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న బంజారాలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో బంజారాల సమస్యల పరిష్కారం, వారి అభివృద్ధి కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సానుకూలంగా ఉన్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల ఏర్పాట్లపై మంత్రి రెండు రోజులుగా ఫోన్‌లో ఆరా తీశారన్నారు. మేడారం జాతర ఏర్పాట్లలో బిజీగా ఉండడంతో తాను ఈ సారి రాలేకపోతున్నానని, వచ్చే ఏడాది తప్పకుండా హాజరవుతానని మంత్రి చెప్పినట్లు పేర్కొన్నా రు. జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవాలాల్ చూపిన మార్గంలో పయనించాలన్నారు. బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క త్వరలోనే బంజారా కుల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. ఇంద్రవెల్లిలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతుందనే ఉద్దేశంతోనే పోలీసులు కొన్నేళ్లుగా జెండా ఆవిష్కరణకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. దీనికి ఆదివాసీలెవరూ అడ్డుపడడం లేదన్నారు. జిల్లాలో కొంత మంది బంజారా నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. 'తాను కేవలం ఆది వాసీల లీడర్ కాదని, అందరి ప్రజా ప్రతినిధినని' అన్నారు. సేవాలాల్ జయంతి వేడుకలకు ఉద్యోగులు సెలవు కావాలని విజ్ఞప్తి చేస్తారు కానీ వేడుకులకు మాత్రం హాజరు కావడం లేదన్నారు. ఇలా చేస్తే రాబోయే రోజుల్లో సెలవురద్దుపై ఆలోచించాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నుంచి సేవాలాల్ జ యంతి వేడుకలను ప్రభుత్వం అధికా రికంగా నిర్వహిస్తూ వస్తుందన్నారు. పదేళ్ల పాటు ఖానాపూర్ ఎమ్మెల్యేగా పదవి అనుభవించిన వారు సభ ముగిసేంత వరకు ఉండకుండా ఉచిత సలహాలు ఇచ్చి మధ్యలో నే వెళ్లిపోవడం సరికాదన్నారు. అంతకు ముందు భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. జగదాంబ మాతా, సంత్ సేవాలాల్ మహారాజ్, రామారావు మహరాజ్ చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బంజారాల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలా బాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆర్డీవో స్రవంతి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ గోడం నగేశ్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావ్, రేఖా శ్యాంనాయక్, బంజారా సంఘం నాయకులు రాథోడ్ హీరాలాల్ నాయక్, సురేశ్, నరేష్ జాదవ్, ఆడే గజేందర్, భరత్ చౌహాన్, జైసింగ్ రాథోడ్, గణేశ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

రజాకార్లపై తిరగబడిన గడ్డ..

- భీం స్ఫూర్తితో ముందుకుసాగాలి
- తీస్‌రీ బార్.. మోదీ సర్కార్..
- భైంసా సభలో అసోం సీఎం హిమంత బిశ్వశర్మ
- బీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు..: కె.లక్ష్మణ్
- నిర్మల్‌లో ప్రారంభమైన బీజేపీ విజయ సంకల్పయాత్ర



అసోం సీఎం హిమంత బిశ్వశర్మకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

నిర్మల్/భైంసా/భైంసాటౌన్: 'నా ప్రియమైన భైంసా సోదర సోదరీమణులారా.. మీ అందరికీ నమస్కారాలు..' అంటూ అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టి ఆకట్టుకున్నారు. స్వతంత్రకాలంలోనే రజాకార్లతో పోరాడిన గడ్డ ఇది. ఇప్పటికీ రజాకార్లు ఉన్నారు. ప్రజలు కుమురంభీం పక్షాన నిలిచి వారిపై పోరాడాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేపట్టిన కుమురంభీం క్లస్టర్ విజయ సంకల్ప యాత్రను మణిపూర్ మంత్రి సుసింద్రోమెయితీతో కలిసి మంగళవారం భైంసాలో ప్రారంభించారు. అంతకుముందు బాసర సరస్వతీమాత ఆలయం వద్ద యాత్ర వాహనాలకు పూజలు నిర్వహించారు.

ఐదు శతాబ్దాల కల నెరవేరింది..

అయోధ్యలో రామమందిర నిర్మాణం ఐదు శతాబ్దాల కల నెరవేరిందని బిశ్వశర్మ అన్నారు. మందిర నిర్మాణంతో దేశమంతా ఉత్సాహకర వాతావరణం నెలకొందన్నారు. తెలంగాణలో బీజేపీ ఎనిమిది ఎమ్మెల్యేలు గెలువడం శుభపరిణామం అన్నారు. రానున్న రోజుల్లో 80 గెలిచి సర్కారు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ అబద్ధాలే చెబుతుందన్నారు. ఒక్క పథకాన్నీ అమలు చేయడం లేదని ఆరోపించారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే మన దేశం ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా ఎదుగుతుందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో బీజేపీని గెలిపించాలని కోరారు. తనలాగే నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చారన్న విషయం తెలుసుకున్నానన్నారు. బీజేపీలోకి వచ్చిన తర్వాత ఆయన ఎమ్మెల్యేగా గెలిచారని, ఇప్పుడు బీజేఎల్పీ నేత కూడా అయ్యారని చెప్పారు. తాను కాంగ్రెస్‌ను వదిలి బీజేపీలోకి వచ్చిన తర్వాత బీజేఎల్పీగా ఉన్నానని, తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రిని అయ్యానని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలవి కుటుంబ, అవినీతి పాలన అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. ప్రపంచ దేశాలు మోదీని నాయకత్వాన్ని ప్రశంసిస్తున్నాయని, కాంగ్రెస్ నాయకులు మాత్రం ఆయన కులాన్ని, వృత్తిని అవమానపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. దేశ రక్షణ కోసం మోదీ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. పదేళ్ల కాలంలో ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా పాలన చేస్తున్నారన్నారు. మోదీ సామాన్యవ్యక్తి కాదని, కారణ జన్ముడని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 ఎంపీ సీట్లు బీజేపీ గెలుస్తుందని సర్వేలు చెబుతున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, అందుకనే బీజేపీతో పొత్తు అంటూ కొత్త దుకాణం తెరిచిందని విమర్శించారు. బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావుపటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పార్లమెంట్ ప్రభారీ అల్జాపూర్ శ్రీనివాస్, కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, బస్ యాత్ర ప్రముఖ్ రావుల రాంనాథ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ఇతర పదాధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి సహకరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న, కలెక్టర్ రాహుల్‌రాజ్

కై లాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్ వద్ద చేపట్టనున్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణంలో దుకాణాలు కోల్పోతున్న వారికి పరిహారం త్వరితగతిన వచ్చేలా చూస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. వ్యాపారులు బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి కలెక్టర్ సమావేశ మందిరంలో ఆర్ అండ్‌బీ, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులతో పాటు వ్యాపారులు, పట్టణ ప్రజలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నష్టపరిహారం ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరితగతిన అందించేలా చూస్తామన్నారు. ఆరు నెలల పాటు పనులు జరిగితే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. ఆర్‌యూబీతో పాటు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. సమావేశంలో ఆర్డీవో స్రవంతి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, మున్సిపల్ డీఈ యూనుస్, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలకేంద్రం చిన్నారులకు సన్మానం



చిన్నారులను సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: మహా కూచిపూడి నృత్య విన్యాసంలో ప్రాతినిధ్యం వహించి గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులను బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో చిన్నారులకు జ్ఞాపికలను అందజేసి శాలువాలతో సన్మానించారు. చిన్న వయసులోనే గిన్నిస్ బుక్ రికార్డులో చోటు దక్కించుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నృత్య శిక్షకుడు మిట్టు రవి, బాలశంకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: దాడిచేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గోవింద్ తెలిపారు. వివరాల ప్రకారం... మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రుక్మారెడ్డి ఆయన కొట్టం వద్ద మంగళవారం నిల్చొని ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ప్రశాంత్‌ను గొర్రెలను ఈ వైపు ఎందుకు తీసుకువస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహానికి గురైన ప్రశాంత్ రుక్మారెడ్డి తలపై కర్రతో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి దైవాన్ని దర్శించుకున్న రాగి పరివారం




పూజలు చేస్తున్న రాగి పరివారం

తలమడుగు: మండలంలోని సాయిలింగి గ్రామానికి చెందిన మాలి కులస్తులైన రాగి పరివారం (శేండే)కి చెందిన 25 కుటుంబాల సభ్యులు మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో షిండేవాయి తాలూకా జంసడ గ్రామంలోని ఇంటి దైవమైన వాగోబా దేవస్థానాన్ని 100 ఏళ్ల తరువాత మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులంతా బాగుండాలని కోరుకున్నట్లు ఆదిలాబాద్ జిల్లా మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాగి రామ్‌కిషన్ తెలిపారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఇంటి దైవాన్ని దర్శించుకున్నామని, సంతోషంగా ఉందన్నారు. ఇందులో రాగిరాం కిషన్, రాగి ఈరన్న, రాగి పాండు, రాగి సంతోష్, రాగి మహదేవ్ ఉన్నారు.

కమ్మనైనది.. అమ్మభాష

‘దేశభాషలందు తెలుగు లెస్స’.. అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తెలుగు భాషలోని మాధుర్యం, గొప్పతనం ఇక ఏ భాషలోనూ లేదని చాలామంది కవులు చెప్పారు. నేటి ప్రపంచంలో దేశాల మధ్య, దేశప్రజల మధ్య సంబంధాలు ఎంత పెరిగాయో తెలిసిందే. రకరకాల పనుల కోసం ఒక దేశం నుంచి మరొక దేశానికి వెళ్లడం సాధారణంగా మారింది. అందుకే ఇంగ్లిష్ అంతర్జాతీయ భాషగా ఆమోదం పొందింది. మన భాషను, సంస్కృతిని కాపాడుకోవడం, భావితరాలవారికి దీన్ని అందిస్తూ మన భాషా సౌందర్య సంపదను కాపాడటం అందరి కర్తవ్యం.



- భావప్రకటనకు మాతృభాషే కీలకం
- తొలిపలుకులు నేర్చేది అమ్మభాషలోనే
- కాపాడుకుంటేనే భాషకు మనుగడ
- నేడు మాతృభాషా దినోత్సవం..

నిర్మల్‌ఖిల్లా: మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలిబడి. పుట్టిన ప్రతిబిడ్డ నోటి నుండి అప్రయత్నంగా వెలువడే తొలిపలుకు అమ్మనే మూలం. అందుకే అది అమ్మభాష.. అదే మాతృభాష సహజంగా అలవడుతుంది. మనిషి తన భావాలను వ్యక్తపరిచే ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. భూమిపైన జీవరాశుల్లో మానవుడు ఒక్కడే తన భావాలను మాటల రూపంలో వ్యక్తం చేయగలడు. జీవన మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మాతృభాషను పరిరక్షించుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఏటా ఫిబ్రవరి 21న నిర్వహిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అమ్మ ఒడిలో...

మనిషి పుట్టగానే తల్లి ఒడిలో నేర్చుకునే పదాలే మాతృభాష. అవి మనిషికి ఎంతో విలువైనవి. అమ్మ పలుకులోని ఆప్యాయత అనురాగం మరెక్కడా దొరకవు. మనిషి తాను ప్రపంచంలో అన్ని చోట్ల జయించాలంటే తన మాతృభాషను గౌరవించాలి. మనస్సులోని భావాలను సహజంగా వ్యక్తం చేయగల శక్తి మాతృభాషకే ఉంది. అయితే నేడు మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ పరభాషల వెంట పరుగులు తీస్తున్నారు. ఇతర భాషలను నేర్చుకోవడం అవసరమే కానీ ఆ వంకతో మాతృభాషను చిన్న చూపు చూడకూడదని జిల్లాకు చెందిన పలువురు తెలుగు సాహితీ వేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పలుకుబడుల భాష కాదు.. బడిపలుకుల భాష కావలె'' అని తెలంగాణ కవి కాళోజీ నినదించారు.

ఆరువేల భాషలు...

ప్రపంచంలో మొత్తం ఆరు వేల భాషలు ఉండగా, భారత దేశంలో 1,652 మాతృ భాషలున్నాయి. వీటిలో 16 భాషలకు మాత్రమే లిపి ఉంది. 200 భాషలకు 1600 పైగా మాండలికాలున్నాయి. మాతృభాష అంతరించి పోయే ప్రమాదాన్ని పసిగట్టిన యునెస్కో ప్రజల జాతీయ, పౌర, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక హక్కుల్లో మాతృభాష అంతర్భాగమని నిర్వచించింది. దేశంలో 57 అక్షరాలు, 3 ఉభయ అక్షరాలు ఉన్న తెలుగుభాష ప్రపంచ భాషల్లోనే రెండో అతి పెద్ద మాతృభాషగా మన్ననలు పొందుతోంది. హిందీ తరువాత తెలుగు మాట్లాడే వారే ఎక్కువ.

ఇదీ నేపథ్యం...

2000 సంవత్సరం నుంచి ఏటా మాతృభాష పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తోంది. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నింటినీ రక్షించుకోవాలని, భాషా వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలనమి యునెస్కో అంటోంది. అందరికీ ఈక్విటీ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. 2002నాటి ఐక్యరాజ్యసమితి తీర్మానంపై యూఎన్ జనరల్ అసెంబ్లీ యూఎన్ దినోత్సవ ప్రకటనకు మద్దతు ఇచ్చింది.

మనదగ్గర మాతృభాషాభిమానులు..

నిర్మల్ జిల్లా అనగానే మాతృభాష అయిన తెలుగు ఔన్నత్యాన్ని చాటే కవులు, కళాకారులు గుర్తొస్తారు. జిల్లా చరిత్రలో ఆది నుంచి సాహితీ సౌరభాలు విరబూస్తున్నాయి. జిల్లాలో తొలితరం కవుల నుండి మొదలుకొని ప్రస్తుతం ఉన్న పద్యకవులు, వచన కవులు, కళాకారులు సాహితీవేత్తల వరకు కొదవలేదు. ఈ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని వర్తమాన కవులు, కళాకారులు ఇదేమార్గంలో పయనిస్తున్నారు.

జిల్లా కవులు...

జిల్లా నుంచి ప్రస్తుతం బొందిడి పురుషోత్తం, నేరెళ్ల హన్మంతు, వెంకట్, చక్రధరి, దామెర రాములు, పత్తి శివప్రసాద్, కరిపె రాజ్‌కుమార్, పుండలిక్ రావు, తుమ్మల దేవరావు, అంబటి నారాయణ, పోలీస్ భీమేష్, కృష్ణంరాజు, కామారపు జగదీశ్వర్, అబ్బిడి రాజేశ్వర్ రెడ్డి తదితర కవులు, రచయితలు మాతృభాషలో తమ రచనలతో సామాజిక చైతన్య ప్రతీకలుగా కొనసాగుతున్నారు.

ఇంటి నుంచే తొలి అడుగుపడాలి..



మాతృభాష అభిమానం అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు తెలుగు భాషను, వారి మాతృ భాషను ప్రోత్సహించాలి. తమ పిల్లలకు తెలుగు నేర్పడం చిన్నతనంగా భావించకూడదు. కనీసం పాఠశాల విద్య వరకు తెలుగు తప్పనిసరిగా చేసి పోటీ పరీక్షల్లో ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. పర భాషల మోజులో మాతృభాషను మరువొద్దు.

– టీకులపెల్లి నరసయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, నిర్మల్

అమ్మ భాషే కమ్మనైనది..



మాతృభాషలో విద్యాబోధన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. మాతృభాష తెలుగు కమ్మనైనది. బిడ్డకు అమ్మపలుకే కమ్మగా ఉంటుంది. అందుకే అమ్మభాష తీయగా ఉంటుంది. మీ మాతృభాషలోని పదనిసలు, భాషా సౌందర్యం చిన్నతనం నుండే పరిచయం చేయాలి. మాతృభాషకు చెందిన కథల పుస్తకాలు, నవలలు వంటి వాటిని చదవడాన్ని ప్రోత్సహించాలి.

– టి.సంపత్‌కుమార్, తెలుగు సాహితీవేత్త, నవల రచయిత, నిర్మల్

మాతృభాషను మరువొద్దు....



చిన్నప్పటి నుంచి అమ్మనేర్పిన మాతృభాష తెలుగు కాబట్టి దీనిని మరువద్దు. తెలుగులో మాట్లాడడానికి నామోషీగా చాలామంది భావిస్తున్నారు. సమాజంలో చాలామంది ఆంగ్ల భాషను మాట్లాడుతూ.. మాతృభాష పట్ల వివక్ష చూపుతున్నారు. అది సరికాదు. ప్రస్తుతం ఎదుగుతున్న యువతరానికి కూడా తెలుగు పట్ల అభిరుచిని పెంపొందించాలి.

– పత్తి శివప్రసాద్, టీవీ వ్యాఖ్యాత, రచయిత, నిర్మల్

ప్రేమోన్మాదిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు విన్నవిస్తున్న నాయకులు

ఖానాపూర్: ప్రేమపేరుతో యువతిని వెంబడించి, ఆమె తిరస్కరించడంతో పట్టపగలు నడిరోడ్డుపై హత్యచేసిన ప్రేమోన్మాది శ్రీకాంత్‌తో పాటు అతడి కుటుంబీకులకు కఠిన శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల పక్షం, ప్రజా సంఘాల నాయకులు బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం కలెక్టర్ ఆశిస్ సాంగ్వాన్‌కు విన్నవించారు. నిందితులకు కఠినశిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నంది రామయ్య, జన్నారపు శంకర్, కట్ట శ్రీనివాస్, నాగెల్లి నర్సయ్య, గొర్ర గంగాధర్, మురళీకృష్ణ, ప్రణీత్, రాజ్‌కుమార్, రవి, సతీశ్, మోహన్ ఉన్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



తహసీల్దార్ కార్యాలయంలో పట్టుబడిన ట్రాక్టర్లు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న పొక్లెనర్‌తో పాటు మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ శివరాజ్ తెలి పారు. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్‌చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు చెప్పా రు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా మొరం, ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పరామర్శిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే లక్ష్మి

నార్నూర్: భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తురిపల్లి అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్‌తీగ తగలి ఇటీవల మృతిచెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఆడే ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం అతడి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే సేవా భావంతో వృత్తిలో చేరిన ప్రవీణ్ వేటగాళ్లు అమర్చిన విద్యుత్‌తీగతో మృత్యువాతపడడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ కనక మోతుబాయి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, మాజీ సర్పంచ్‌లు ఊర్వేత రూప్ దేవ్, రాథోడ్ సావీందర్, రాథోడ గోవింద్, సాగర్, పింటూ, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంతురావు, నాయకులు సయ్యద్ కాశీం, బాబాఖాన్, ఫిరోజ్ ఖాన్ ఉన్నారు.

ప్రారంభమైన అక్కకొండ బ్రహ్మోత్సవాలు

- నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



అర్చకుల పూజలు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగపూర్ గ్రామాల సమీపంలోని అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణచార్యులు భీష్మ ఏకదశి, విష్ణు సహస్రనామం, అష్టోత్తర శతకలభిషేకం–స్వప్న క్రతువు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించాడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. బుధవారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జగ్గరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజా రమేశ్‌గౌడ్ తెలిపారు.

లక్ష్య సాధనతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఐఏఎస్ అకాడమి డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: యువత లక్ష్య సాధనతో ముందుకు సాగాలని హైదరాబాద్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగకపోవడంతోనే రాణించలేక పోతున్నారని పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలన్నారు. చాలా మంది యువత నిరుత్సాహంతోనే అనుకున్న లక్ష్యాలను చేరుకోలేక పోతున్నారని తెలిపారు. ఒక వ్యక్తి రాణించాలంటే వ్యక్తిత్వం, కుటుంబ నేపథ్యం, విలువలు అనే అంశాలను పరిగణలోకి తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ కొలువులే కాదు, ప్రైవేట్ ఉద్యోగాలకు కూడా ప్రస్తుతం డిమాండ్ పెరిగిందన్నారు. ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల క్షేత్రపర్యటన



గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో పరిశీలించిన విద్యార్థులు

భైంసా: కామారెడ్డి జిల్లాలోని గాయత్రి షుగర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను మంగళవారం బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సందర్శించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా కెమికల్ ఇంజినీరింగ్ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులు వెళ్లి పరిశీలించారు. చెరుకు నుంచి చక్కెర ఉత్పత్తి చేసే విధానం అందులో ఉన్న యూనిట్ ఆపరేషన్స్‌ని విద్యార్థులు దగ్గరగా చూశారు. ఈ ప్రక్రియలో బైప్రొడక్ట్‌గా మొలాసిస్ నుంచి డిస్టిలేషన్ ద్వారా ఇథనాల్ ఎలా ఉత్పత్తి అవుతుందనే అంశాన్ని పరిశీలించారు. వీరి వెంట కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వినయ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం

- చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్

లోకేశ్వరం: బాల్య వివాహాలు చట్టపరంగా నేరమని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని నిర్మల్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఓస శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మన్మద్ గ్రామంలో బాల్య వివాహం జరుపుతున్నారని 1098 నంబరుకు సమాచారం అందడంతో మంగళవారం గ్రామానికి వెళ్లారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 18 ఏళ్లు నిండే వరకు అమ్మాయిలకు పెళ్లి చేయొద్దని సూచించారు. ఈమేరకు కుటుంబ సభ్యులతో నోట్ రాయించుకున్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ గంగాధర్, ఐసీపీఎస్ అధికారులు శైలజ, కరుణశ్రీ, ఏఎస్సై దింగబర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నిర్మల్‌కు బండి సంజయ్

నిర్మల్: బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బ ండి సంజయ్ బుధవారం నిర్మల్ జిల్లాకేంద్రానికి రానున్నారు. ఉదయం 10 గంటలకు వెయ్యిఉరిల మర్రి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించనున్నారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశించే బీజేపీ విజయసంకల్ప యాత్రలో పాల్గొంటారు.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా డీసీ

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా డిప్యూటీ కమిషనర్ (డీసీ) నర్సింహారెడ్డికే అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల ఏసీగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని మెదక్‌కు బదిలీ చేసింది. ఆ పోస్టులో ఎవరినీ నియమించలే దు. తాజాగా ఈయనకే అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మృతదేహం లభ్యం

భైంసా: బాసర గోదావరి నది మొదటి ఘాటు వద్ద గుర్తుతెలియని మహిళ(55) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేష్ తెలిపారు. మొదటి ఘాటు వద్ద నీటిలో మంగళవారం మహిళ మృతదేహం కనిపించింది. దీంతో జాలర్ల సాయంతో బయటకు తీశారు. ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని, మృతురాలి వివరాలు తెలిస్తే బాసర పోలీసులను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకా గణేష్‌పూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్(35) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు వివరాల ప్రకారం... గణేష్‌పూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్, సుధీర్, సంజీవ్‌లు కూలీ పని కోసం మోటార్ సైకిల్‌పై గోటి గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న మ్యాక్స్ వాహనం ఢీకొనగా ఇరువురు గాయపడ్డారు. జ్ఞానేశ్వర్‌కు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు కిన్వట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తండ్రి విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

లక్సెట్టిపేట: ఈ నెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పాలమాకుల నారాయణ (70) ఈ నెల 16న మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం పొలం వద్దకు వెళ్లి అక్కడే పడుకున్నాడు. మరుసటిరోజు ఇంటికి వచ్చేసరికి అతని భార్య బాధపడుతుండడం గమనించి మనస్తాపానికి గురయ్యాడు. మళ్లీ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయం కుమారులకు తెలియడంతో మంచిర్యాలలోని ప్రైవేట్ తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్యాచరణ నివేదిక అందజేయండి

- పార్కు స్థలంలో గుడి నిర్మాణంపై అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని పిల్లల పార్కు స్థలం ఆక్రమణపై విచారణ జరిపి కార్యాచరణ నివేదిక అందజేయాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ప్రధాన కార్యదర్శి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా వివరాలు అందజేయాలని ఆదేశిస్తూ, విచారణను వచ్చే నెల 7కు వాయిదా వేసింది. అలాగే శైలజ అనే అధికారిపై లేఖలో చిన్నారులు ఫిర్యాదు చేయడంతో ఆమెను ప్రతివాదుల జాబితాలో చేర్చాలని ఆదేశించింది. ‘అణగారిన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ఆదిలాబాద్ నడిబొడ్డున 1970లో హౌసింగ్ కాలనీని ఏర్పాటు చేశారు. ఇందులో ఎకరంపైగా స్థలాన్ని పిల్లల పార్కు కోసం కేటాయించారు. 2000–2004 మధ్య కాలంలో సుమారు 0.30 గుంటల భూమిని అక్రమార్కులు ఆక్రమించి ఆలయాన్ని నిర్మించారు. ఆ మిగిలిన భూమిని కూడా అధికారుల అండతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీన్ని అడ్డుకుని పార్కు రక్షణ చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి’ అంటూ ఆదిలాబాద్‌కు చెందిన కుమారి ఎ.దీక్షతోపాటు మరో 22 మంది చిన్నారులు గత డిసెంబర్ 29న హైకోర్టుకు లేఖ రాశారు. ఈ లేఖను టేకెన్ అప్ పిల్‌గా న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

కేంద్రం నిర్లక్ష్యంతోనే రైల్వే లైన్ ఆలస్యం



సంఘీభావం ప్రకటిస్తున్న మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య పూరిత వైఖరి కారణంగానే ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం ఆలస్యం అవుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మించాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ తరఫున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలైన్ విషయమై కేంద్ర ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలను అందజేసినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రాజెక్టు రిపోర్ట్ ఇవ్వకుండా కేవలం జీవోను మాత్రమే విడుదల చేసినట్లు మండిపడ్డారు. కేంద్రం పనులను పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కారణంగానే పనులు నిలిచిపోయాయని బీజేపీ నేతలు అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేలైన్ సాధించేంతవరకు సాధన కమిటీ పోరాటానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ చైర్మన్ నారాయణ యాదవ్, నాయకులు దత్తాత్రి, విజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, బండారి సతీష్, సంద నర్సింగ్, అశోక్ స్వామి, వెంకన్న తదితరులు ఉన్నారు.

జీవనోపాధిపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖానాపూర్: వ్యవసాయం చేస్తూనే తక్షణ జీవనోపాధి అందించే మార్గాలపై ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి మౌనిక రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని సింగాపూర్, బావాపూర్(ఆర్), తర్లపాడ్, పాత తర్లపాడ్ గ్రామాలకు చెందిన రైతులకు కూరగాయల సాగు, డెయిరీ ఫాం, ఉద్యానవన పంటల సాగు గురించి వివరించారు. పంటల సస్యరక్షణ, డ్రిప్, మల్చింగ్‌సాగు పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో డ్రీమ్ సొసైటీ, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు లక్ష్మణ్, చిన్నయ్య, రవి, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రలో ఉద్రిక్తత

- ఇథనాల్ ఫ్యాక్టరీపై మాట్లాడాలని కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు
- ఇరుపార్టీల నడుమ వాగ్వాదం, చెదురగొట్టిన పోలీసులు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ విజయ సంకల్ప యాత్ర సందర్భంగా తీవ్ర అలజడి నెలకొంది. సంకల్ప యాత్రలో బీజేపీ శాసన సభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇథనాల్ ఫ్యాక్టరీపై మాట్లాడాలని దూసుకురావడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో స్థానిక కాంగ్రెస్ నేతలు కట్కం రాజారెడ్డి, అర్గుల రమణలను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారు. కొంతదూరంలో మరికొంత మందిని పోగుచేసుకుని ఫ్యాక్టరీపై మాట్లాడాలని నినాదాలు చేయడంతో వారిని పోలీసులు అదుపు చేసే క్రమంలో స్థానిక బీజేపీ కార్యకర్తలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో నాయకులు తమ ప్రసంగాన్ని ముగించి వెళ్లిన తర్వాత సైతం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో నిర్మల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా బీజేపీ నాయకులు డి.ముత్యంరెడ్డి, మాజీ సర్పంచ్ జంగం వీరేశ్ మాట్లాడారు. ఇది అభివృద్ధికి అడ్డుకట్ట వేసే పద్ధతని, ఇలాంటి ఆకృత్యాలను వీడనాడి అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.